# పసిపాప నవ్వు

క్లాసులో పిల్లలను చూస్తూ కూర్చుంది మాధవి. పిల్లలు ఒకటే గోల చేస్తున్నారు. విసుగ్గా నిస్సహాయంగా వాళ్లకేసి చూస్తూ కూర్చుంది. వాళ్లను ఊరుకోమని చెప్పి లాభంలేదు. అరవవద్దని తాను గట్టిగా అరచి చెపుతుంది, బల్లమీద రూళ్లకర్రతో బాదుతుంది. ఆ చప్పుడుకు క్షణం ఊరుకుంటారు క్షణం నిశ్శబ్దం. తరువాత మళ్ళీ నాలుగు వైపులనించి కిచకిచమని ధ్వనులు వినిపిస్తాయి. రకరకాల ఫిర్యాదులు, సన్న సన్నని ఏడుపులు ప్రారంభమౌతాయి. "నా కాలుమీద గిల్లాడు" "నా నోటుబుక్కు చింపేశాడు" "నా గౌనుమీద సిరా పోసింది" "నన్ను ముందుకు తోస్తున్నాడు" ఒకరి మీద ఒకరు ఇలా చెప్పుకుపోతూనే ఉంటారు. ఒకళ్లను సముదాయిస్తే ఇంకోళ్ళు ప్రారంభిస్తారు. నిజంగా ఈ నర్సరీ క్లాసు పిల్లలను సముదాయించేటప్పటికి మతి పోతుంది. అయినా వాళ్లతో ఉంటే మనసుకెంతో ఆనందంగానూ ఉంటుంది వాళ్ల ముద్దు ముద్దు ముఖాలు, తొణికిసలాడే అమాయకత్వం, టీచరంటే ఏదో అపురూపమైన వ్యక్తిలా అభిమానమూ, తనతో దగ్గరగా సరదాగా మాటలు చెప్పాలన్న తపన! అంతా మనసుకేదో

ఊరట! ఆ పసిపిల్లలు అంతగా తనను పెనవేసుకోటానికి తనలో ఏముంది, అని మనసు కుంచించుకుపోతుంది.

సాయంత్రంవేళ చాలామంది తల్లులు పిల్లలను ఇంటికి తీసుకుపోవటానికి వస్తారు. కాస్సేపు తనతో ఆప్యాయంగా పిల్లల ముచ్చట చెప్తారు. "చూడండి మా పాప మీ పేరు చెపితే చాలు ఏ పనైనా చేస్తుంది. రోజూ మీ మాట చెపితేనే అన్నం సరిగా తింటుంది. లేకపోతే ఏదీ వద్దంటుంది." "పాటలు కథలు మేం ఏం చెప్పినా విన దండి, పాఠం తప్పు చదివినా, మా టీచరు అలానే చెప్పా రనో, నీకేం తెలుసనో వాదిస్తుంది. ఎక్కడైనా మీరు తప్పు చెపుతారా?" అంటూ నవ్వుతారు. తనకూ నవ్వు వస్తుంది. ఆ పసిపిల్లలతో వాళ్ళ కుటుంబాలతో ఏదో ఆత్మీ యత ఏర్పడుతుంది. మనసును కమ్ముకున్న మసక మాలలు ఒక్కటొక్కటే విడిపోతాయి. పిల్లలకేసి చూస్తో మాధవి తన జీవితం నెమరు వేసుకుంది.

తను ఈ స్కూల్లో మూడేళ్ళుగా పనిచేస్తోంది. తను ఎప్పుడూ ఉద్యోగం చెయ్యాలని అనుకోలేదు. ఇంట్లోను ఎవరూ అనుకోలేదు. కాలం కర్మ అలా కలసి వచ్చాయి. ఏదో సరదాకు పోనీ కొన్నాళ్ళు చేసి చూద్దామని ఇందులో దూరింది. మళ్ళా బయట పడలేదు, అక్కడే కూరుకు పోయింది. విలాసంగా ఊగి పట్టుకున్న కొమ్మే బ్రతకటానికి ఆధారమైంది.

తన తండ్రి తాసిల్దారు చేసి పింఛను పుచ్చుకున్నాడు.
తీరికగా భారత భాగవతాలు చదువుతూ కూర్చుంటాడు
అమ్మ ఎప్పుడూ మడి కట్టుకుని పూజలు వంటలు చేసు
కుంటూ కూర్చుంటుంది. కాస్త తీరిక దొరికితే గుళ్ళో
పురాణానికి వెళుతుంది. ఆ పురాణ గాథలన్నీ ఇంటికి వచ్చి
పరవశత్వంతో నెమరు వేసుకుంటూ ఉంటుంది. ఆమె కదే
కాలక్షేపం. ఆ ఆనందాన్ని ఆమెతో సరిసమానంగా పంచు
కునే స్నేహితులూ చాలమంది ఉన్నారు.

అన్నయ్యలిద్దరూ చెరొక ఊళ్ళో ఉద్యోగాలు చేస్తు
న్నారు. పెళ్ళిళ్ళై కాపరాలు చేస్తున్నారు. ఇంట్లో తనే
ఆఖరు పిల్ల. తనకు పెళ్ళి చెయ్యాలని ఎన్నో ఏళ్ళుగా అమ్మ
నాన్నా అన్నలూ ప్రయత్నాలు చేశారు. కాని అందరిలా
వివాహమై అత్తవారింటికి వెళ్ళే అదృష్టం తనకులేదు. ఎంత
ప్రయాసతో ప్రయత్నించినా తల తాకట్టు పెట్టయినా అడి
గిన కట్నమివ్వటానికి సిద్ధపడినా ఒక్క సంబంధమూ కుదర
లేదు. ఎవరూ తనను చేసుకోవటానికి ఇష్టపడలేదు. గంపంత
ఆశతో, గడప గడప తిరిగి ఊరూరు వెతికి చివరకు అందరూ
ఆశలు వదులుకున్నారు. ఇక తను కన్యగా తమ ఇంటనే
నిలచిపోవటానికి మనసులో ఒక విధంగా రాజీపడి నిర్లిప్త
తతో ఊరుకున్నారు. ఇప్పుడు ఎవరూ ప్రయత్నాలు చెయ్య
టంలేదు.

తనకు సంబంధము ఎందుకు కుదరలేదో తనకు
స్పష్టంగా తెలుసు. తన్ను సృష్టించినప్పుడే తనమీద పగతో

భగవంతుడు తనకొక భారమైన లోపం కలిగించాడు. అది
దాచిపెట్టుకుంటే దాగేది కాదు. అయినా చిన్నతనంలో
దాచుకోవాలనే తాపత్రయపడేది. చిన్నప్పుడు తనను చూసిన
వాళ్ళు సంతోషంగా అనేవారు, "ఎంత అందంగా మెరిసి
పోతోందో మాణిక్యంలా ఉంది." అనేవారు మళ్ళా అంత
లోనే చూపులు వాల్చుకొని "అయ్యో! పాపం!" అనేవారు
ఆ పాపమేదో కప్పిపుచ్చుకోడానికి తాను కలవరపడేది.
పావడా కుచ్చెళ్ళలో చీరకొంగులలో కనపడకుండా కప్పుకు
నడిచేది. తన కుడిపాదం మడమ దగ్గర వంపు తిరిగి వంకర
పోయింది. అతి ప్రయాసమీద కాని అడుగు పడదు. నెమ్మ
దిగా కాలు ఈడ్చుకుంటూనే నడక సాగించాలి అది తన
దురదృష్టం. ముఖంలో అందమూ కాలిలో అవిటితనమూ
భగవంతుడు తనకు ప్రసాదించిన వరం! ఎందుకో! ఏమో!
ఎవరికి తెలుసు? అడగడానికి ఆ భగవంతుడు కనిపించడు.

చిన్నప్పుడు అందరూ తన ముఖంచూచి ఆనందమూ,
కాలుచూసి నిర్వేదమూ వ్యక్తంచేస్తూ ఉంటే అది తనకేదో
బాధగా అవమానంగా ఉండేది అది ఏదో సిగ్గుపడవలసిన
విషయంగా మనసు కుమిలిపొయ్యేది. క్రమంగా తను నలు
గురిలోకి వెళ్ళటం మానేసింది. ఎన్నడూ గడపదాటి బయ
టకు వెళ్ళలేదు ఇంటికి ఎవరైనా వస్తే కనపడకుండా ఏ
మూలో దాక్కునేది. అమ్మ, అన్నయ్యలతో తప్ప నోరు
విప్పి ఎన్నడూ ఎవరితోను మాట్లాడలేదు. తండ్రి దగ్గర
ఎప్పుడూ చనువులేదు దూరదూరంగానే ఉండేది. అవిటి

బ్రతుకని అమ్మా నాన్నా ఇంట్లోనే చదువు చెప్పించారు. అలాగే చదువుకుని ప్రైవేటుగానే పరీక్షలు ప్యాసయింది. ఇంట్లో అందరు తనకు సంబంధాలు వెతుకుతుంటే తనకు గుండెల్లో భయం పట్టుకుంది. ఈ అవిటిదాన్ని ఎవరు చేసుకుంటారు? చేసుకున్నా సుఖపెడతారా! ఎప్పుడో విసుగుజెంది విడిచిపెట్టరా? అన్నయ్యలు ఇస్తామన్న కట్నానికి ఆశపడి ఎవరో ఒకరు ఒప్పుకున్నా డబ్బుకు ఆశపడిన వ్యక్తి తనమీద ప్రేమ చూపుతాడా? జాలిపడతాడా? నడిదారిలో వదలివేస్తే తన బ్రతుకు ఏమౌతుంది? డబ్బుఇచ్చి కొనుక్కున్న వ్యక్తితో ఆనందం ఎలా ఉంటుంది? మనసు కలుస్తుందా? ఏమో ఆలోచనలు! కాలు కుంటిఅయినా మనసులో ఆలోచనలు, అభిమానమూ హద్దుమీరే ఉన్నాయి. ఏ సంబంధమూ కుదరకపోవడంతో తను ఒక విధంగా సంతృప్తి పడింది. ఏ సంతోషానికి ఎదురు చూడకుండా రోజులు గడపడానికి మనసులో రాజీపడింది. నిర్లిప్తంగా కాలంగడపింది. మనసులో ఆశలు లేవు, ఆ వేదనలు లేవు. బ్రతుకు నిర్మలంగా ప్రశాంతంగానే నిలచిపోయింది.

పట్నంనుంచి ఒకామె వచ్చింది, కామేశ్వరిట. ఆమె తన ఇంటిదగ్గర నర్సరీస్కూలు ప్రారంభించింది. ఇరుగు పొరుగు పిల్లలు అంతా చేరారు. ఏమీ తోచక తను ఇంట్లో ఊరికే కాలం గడుపుతోంది. ఆ స్కూల్లో తను పని చేస్తే బాగుండునని తోచింది. పసిపిల్లలతో కాలక్షేపం అవుతుంది.

స్కూలు కూడా ఇంటిదగ్గర-వెళ్ళడానికి ఇబ్బంది ఉండదు. నాన్నతో చెపితే ఆమెను వెళ్ళి అడిగారు ఆమె వెంటనే ఒప్పుకుంది. ఆమె కూడా ఒంటరిగా స్కూలు నిర్వహించలేకపోతోంది మాధవి వస్తే కొంతభారం తీసుకుంటుంది, అని సంతోషించింది. అలా తనకు ఉద్యోగం ఏర్పాటైంది. రోజులు నిమిషాల్లాగా గడచిపోతున్నాయి. క్రమంగా నర్సరీ క్లాసు భారమంతా తనమీదే పడింది. పిల్లలకు ఆటలు పాటలు నేర్పటమూ, అక్షరాలు గుర్తు చూపిండటమూ, కథలు చెప్పటమూ, కాలం సంతోషంగానే గడిచిపోతోంది.

స్కూలు పక్క వీధిలో ఉంది. తన ఇంటి ప్రక్కనే పెద్ద పార్కు ఉంది. ఆ పార్కులోనించి దాటి అవతలి వైపుకు వెళితే సరిగ్గా స్కూలు గుమ్మం వస్తుంది. అది చాలా పెద్ద పార్కు, పెద్ద చెట్లు చిన్న మొక్కలు, తీగలు చాలా ఉన్నాయి. అక్కడక్కడా చెట్ల క్రింద తిన్నెలు ఉన్నాయి. పార్కుకు మధ్యగా ఎఱ్ఱని పూలు పూసే పెద్ద మానొకటి ఉంది. తరుచుగా ఆకులు లేక ఎఱ్ఱని పూలే చెట్టున సందులేకుండా నిండిఉంటాయి ఆ చెట్టు పేరేదో తనకు సరిగా తెలియదు. దాని చుట్టూ గుండ్రంగా తిన్నె కట్టబడి ఉంది. పక్కనే చాలా పున్నాగ చెట్లు వరుసగా ఉన్నాయి. పూలు తెల్లగా కుప్పగా రాలి ఉంటాయి. ఆ ప్రక్కనించి వెళుతుంటే పువ్వుల పరిమళం వెన్నాడుతూ ఉంటుంది. ఆ చోటు ఎంతో బాగుంటుంది! అయితే ఆ పార్కులో తరుచుగా ఎవరూ ఉండరు. తను స్కూలుకు

వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ అసలే ఉండరు. ఎవరో ఒక రిద్దరు పనీపాటా లేని సోమరిపోతులు మాత్రం అక్కడక్కడా తిన్నెల మీద నిద్రపోతూ ఉంటారు. అందుకే తను ఏ భయమూ సంకోచమూ లేకుండా స్కూలుకు హాయిగా వెళ్ళి రాగలుగుతోంది. కార్లు బండ్లు ఎదురు వస్తాయేమో నని భయంగాని, మనుష్యులెవరైనా తన్నుచూచి నవ్వుతా రేమోనన్న సంకోచంగాని ఉండవు. ఆ స్కూలు అలా దగ్గరగా ఉండడమూ అదృష్టమే. అలా అలా స్కూల్లో చేరి మూడేళ్ళు గడిచిపోయాయి.

ఆ వేళ స్కూలునుంచి ఇంటికి వెళ్ళేప్పటికి ఆలస్యమైంది. రోజు ఎవరో ఒకరు వచ్చి పిల్లలను ఇంటికి తీసుకు వెళ్ళేవరకు తను స్కూల్లోనే ఆ పిల్లలకు కాపలా ఉండాలి. అందరూ వెళ్ళాకే తను ఇంటికి వెళ్తుంది. అంచేత ఒక్కొక్కరోజు తను ఇంటికి వెళ్ళేటప్పటికి పొద్దుపోతుంది. ఎవరో ఒక పిల్ల వాళ్ళ వాళ్ళు రాక ఆగిపోతుంది. ఆ పిల్ల వెళ్ళేవరకు తనూ వెళ్ళడానికి వీల్లేదు ఆ పిల్లతో కబుర్లు చెపుతూ అలానే ఉండిపోతుంది. ఒక్కోసారి విసుగెత్తితే తనుకూడా వెళ్ళి ఆ పిల్లను ఇంట్లో దింపి తను వెళ్ళిపోతుంది. కాలుకుంటి అవడంవల్ల అలా తరుచుగా చెయ్యలేదు. ఆ వేళ శశికళ స్కూల్లో చాలాసేపు ఉండిపోయింది. రోజూవచ్చే వాళ్ళమ్మ జానకమ్మ ఆ వేళ ఆలస్యంగా వచ్చింది; ఆవిడికింట్లో ఏదో ఇబ్బందట! తను అంతసేపు శశికళతో మాట్లాడుతూ కూర్చుంది. ఆ పిల్లకు తనంటె ఎంతో ఇష్టం. క్లాసులో

ఉన్నంతసేపు ఆ పిల్ల కళ్ళు తననే చూస్తూ ఉంటాయి. తను ఏపని చెప్పినా అందరికన్నా ముందు ఆ పిల్లే చేస్తుంది. తన దగ్గరకు ఆప్యాయంగా పరుగెత్తుకు వస్తుంది. తనకూ ఆ పిల్లంటె చాలా ముద్దు. తెల్లగా బొద్దుగా వుంటుంది. అమాయకంగా ముద్దుముద్దుగా మాట్లాడుతుంది. అలా ఆ పిల్లతో ముచ్చట చెపుతూఉంటే ఉల్లాసంగానే ఉంటుంది. ఆవేళ జానకమ్మ వచ్చి పిల్లను తీసుకు వెళ్లాక తనూ ఇంటికి బయలుదేరింది. అందుకే పొద్దుపోయింది.

పార్కు దాటి వస్తోంటే ఎఱ్ఱపూలచెట్టు దగ్గర ఎవరో తారట్లాడుతున్నాడు. దగ్గరకు వచ్చేవరకు తాను చూడనే లేదు. సాధారణంగా "అక్కడ ఎవరో ఒక రిద్దరు కాడ్డీ వెధవలు మాత్రం ఎప్పుడైనా ఉంటారు. తను ఆ త్రోవన పోతోంటే హేళనగా వెకిలిగా నవ్వుతారు. దూరాన్నుంచి వాళ్ళ ఉనికిని చూడగానే తనకు గుండె గతుక్కుమంటుంది. భయంతో మనసు కుంచించుకపోతుంది. దూరాన్నే తల వంచుకుని తనలోనికి తాను ముడుచుకుపోతుంది. ఆ చెట్టు దాటి కొంతదూరం పొయ్యేవరకు మళ్ళా తల ఎత్తదు. ఇవ్వాళ అక్కడ అతను ఒక్కడే ఉన్నాడు. అతని ముఖం కాడ్డీ ముఖంలా లేదు. చదువు, సంస్కారము ఉన్న ఉన్నత కుటుంబపు వ్యక్తిలా వున్నాడు. అతని చూపుల్లో హేళన లేదు. వెకిలితనం లేదు. తన అవిటితనంమీద అపరిమితమైన జాలిఉంది. అందుకే తనకు భయం వెయ్యలేదు. ధైర్యంగా అతనివేపు తేరిపార జూచింది. తను అలా చూడడం అతనికి

ధైర్యం వచ్చింది. ఒక్కడుగు ముందుకు వచ్చాడు. సంకోచంగా తనను చూస్తూ అడిగాడు

"ఈ పార్కుదగ్గరే కాంతయ్యగారి ఇల్లు ఉందిట మీకు తెలుసా? ఆయన తాసిల్దారుచేసి రిటైరయ్యారు." ఆమాటకు తను ఉలిక్కిపడింది. పరిహాసానికి అలా తన తండ్రిని గురించి అడగడంలేదుకదా? అనుమానంతో బదులు చెప్పకుండా ఊరుకుంది. అతను మళ్ళీ అన్నాడు.

"మాది ఈ ఊరుకాదు. మీకు తెలిస్తే చెప్పండి. పార్కుకు ఏవైపో తెలియటంలేదు" అన్నాడు జాలిగా. అప్పుడు చెప్పింది తను. "ఆయన మా నాన్నగారే ఇదుగో పార్కుకు ఇవతలవేపు ఉన్నదే మా ఇల్లు." అన్నది. అతను సంతోషించాడు. అప్పుడు చెప్పాడు. "నేను రామేశంగారబ్బాయిని. ఆయన కలక్టరుచేసి ఆ మధ్య పోయారు. మా తండ్రిగారికి మీ నాన్నగారికి చాలా స్నేహమట. చాలా ఏళ్ళక్రిందట ఒకే ఊళ్ళోనే ఉండేవారట. మీకు తెలీదేమో! మా అమ్మ చెప్పింది. ఈ ఊరు వస్తేంటే తప్పకుండా చూసి రమ్మని మరీమరీ చెప్పింది." అన్నాడు. మాట్లాడుతూ మాట్లాడుతూ తనతో కూడా నడిచాడు తనపేరేమిటో తనే చెప్తేంటో తెలుసుకున్నాడు. తన కాలు అపిటి ఎలా అయిందో అడిగాడు. పుట్టుకతోనే వచ్చిందంటె విచారపడ్డాడు. "పాపం మీరు నడవలేకుండా వున్నారు. ఆ సంచీ బరువుకూడా ఏం మోస్తారు? ఇలా ఇవ్వండి," అని తను బదులు చెప్పేలోపలే చేతిలో సంచి లాక్కున్నాడు. ఇల్లు

చేరుతూఉంటే తనకు ఎన్నాళ్ళగానో అతనితో పరిచయం ఉన్నట్లనిపించింది జీవితంలో మొట్టమొదటిసారిగా తన కుంటి కాలు కప్పిపుచ్చుకోవలసిన అవసరం కనిపించలేదు. అతని ముందు తన అవిటితనం దాచుకోటానికి ఏ విధంగాను ప్రయత్నించలేదు. చీర కుచ్చెళ్ళు సర్దుకోలేదు. అతనికి దూరంగా నడవలేదు. తన కాలు అలా వుండడం అతి సహజంగాను అందులో అవమానపడవలసినది ఏమీ లేనట్లుగాను అనిపించింది ఒక్కక్షణం.

చిన్ననాటి స్నేహితుని కొడుకును చూచి తండ్రి సంతోషించాడు ఆప్యాయంగా ఆహ్వానించాడు. అమ్మ ప్రేమతో కాఫీ తెచ్చి అందించింది. అతను ఆ ఊరు ఏదో పని నేర్చుకోటానికి వచ్చాడుట. బంధువుల ఇంట్లో ఉన్నాడట. రెండు మూడు నెలలుండి వెళ్ళిపోతాడట. అదీ అతను తన్నుగురించి చెప్పిన వివరాలు.

ఆ తరువాత అతను చాలాసార్లు తనఇంటికివచ్చాడు. తరుచుగా తను స్కూలునించి వచ్చిన టైములో, అమ్మ పురాణానికి నాన్న షికారుకు వెళ్ళినప్పుడు, తానే అతనికి ఆతిథ్యం ఇవ్వవలసి వచ్చేది. అతనితో కబుర్లు చెప్తూ వుంటే ఎంత పొద్దుపోయిందీ తెలియలేదు ఒక్కొక్కప్పుడు! అలా ఒంటరిగా అతనితో మాట్లాడుతూ కూర్చోటం తప్పేమోననీ తోచలేదు ఎప్పుడూ! చిన్నప్పటినుంచితనలో గూడుకట్టుకున్న భయమూ ఒంటరితనమూ గాలికి దూది

పింజల్లా క్షణంలో చెదరిపోయి అతని ఎదట తనమనసెంతో తేలికగా స్వేచ్ఛగావుంది

తను ఎక్కడో చదివింది "ఈ సృష్టిలో ప్రతిప్రాణి మరొక ప్రాణికోసం, ప్రతి ఆత్మ తనకు ప్రతిరూపమైన మరొక ఆత్మకోసం నిరంతరమూ అన్వేషిస్తూ పరిభ్రమిస్తూ వుంటుందని!" అది ఎంతవరకూ నిజమో తెలియదు! తన ఆత్మ స్వరూపమేమిటో తనకు తెలియదు! అయినా తన ప్రాణానికి ప్రతిప్రాణము తన ఆత్మకు ప్రతిరూపమూ అతనిలో వున్నట్లు భ్రమ కలిగింది. ఎవరి ప్రోత్సాహము, ఎవరి ఆహ్వానము అక్కరలేకుండానే మనస్సు అతన్ని పెనవేసుకుంది. మళ్లా వెనక్కు మళ్లటం దానికి సాధ్యంకాదు. అది ఆ క్షణం తనకు తెలియదు.

క్రమంగా తన కథ అంతా అతనికి చెప్పింది. అన్నయ్యాలు సంబంధాలు వెతకటం, ఏదీ కుదరకపోవడం, నిరాశతో అందరూ నిర్లిప్తంగా ఊరుకోటం, స్కూలు జీవితంలో తనకు ఊరట కలగటం ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా రోజులు ఒక్కలా సాగిపోతూ వుండడం, ఏవేవో తనకు తోచినవన్నీ చెప్పింది. అతను ఆప్యాయంగా విన్నాడు. తనమీద అపరిమితమైన జాలిచూపాడు. ఆ ఆప్యాయత, ఆ జాలి అపరిమితమైన అనురాగమని తను భ్రమపడింది. అపరిమితమైన అనురాగంతో అన్ని ఊహలు నశించిన తనకు అతని మనోభావాల స్వరూపమేమిటో ఎన్నడూ స్పష్టంగా తెలియలేదు.

ఆఖరురోజు అతను ఊరికి వెళుతూవుంటె తను విప రీతంగా దిగులుపడింది. అతను ఓదార్పుగా అన్నాడు. "వెళ్ళగానే వుత్తరం రాస్తాను" అని. అది తనకు ఊరట నిచ్చింది. అతను ఎన్నడూ చెప్పనూలేదు, తాను విననూ లేదు, అయినా అతను తన్ను ఆదరిస్తాడని ఆజన్మాంతమూ తోడునీడగా వుంటాడని ఎందుకో భ్రమ కలిగింది. అతను వెళ్ళిపోయాడు.

చాలారోజులు అతని ఉత్తరంకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అతను ఎంత ఆప్యాయంగా రాస్తాడో ఆ ప్రియ మైన వాక్యాలు ఎంత ఇంపుగా ఉంటాయో అని ఊహలు అల్లుకు ఎదురుచూచింది. రోజులు గడిచాయి. వారాలు దాటాయి, నెలలు పూర్తయాయి. అతను వ్రాయలేదు. అతను ఎక్కడ వున్నది తనకు సరిగా తెలియదు. ఏదో ఊరు పేరు చెప్పాడు. అడ్రసు తను అడుగలేదు. అతనుచెప్పలేదు.

ఎంతో ప్రేమగా అతను వ్రాసిన వాక్యాలు చూడా లని తపనపడిన తనకు నిస్పృహ మిగిలింది. ఎందుకు రాయ లేదో అన్న భయం వేధించింది. క్రమంగా ఒంట్లో సత్తువా నశించింది మనస్సులో ఉత్సాహం మాయమైంది. బడికి ఎందుకు వెళుతుందో ఇంటికి ఎందుకు వస్తుందో తెలియ కుండా రోజులు గడిచాయి. బడిలో పిల్లలు ఎంత అరచినా అల్లరి చేసినా చెవిటివాడి దగ్గర శంఖం ఊదినట్లు ఏదీ విని పించలేదు. నిర్లిప్తంగా వూరుకుంది. పసిపిల్లలు ఎంత మసు

రంగా పలకరించినా మరో లోకంలో పరితపిస్తున్న మనస్సు మామూలులోకంలోపడలేదు. క్రమంగా శిరసించి నిర్జీవంగా ఉన్న తనను చూచి వ్యాధిఏమిటో తెలియక తల్లికలవరపడింది.

ఆఖరుకు అతను రాశాడు. ఆనందంతో ఆ ఉత్తరం విప్పిచూచుకుంది. అది తను ఊహించుకున్నట్లుగా లేదు. “చాలారోజులుగా నీకు రాయలేకపోయాను. నామనస్సు చపలమైంది. నిలుకడలేదు. నీమీద జాలి ముంచుకువస్తుంది. అయినా నీకోసం నేనేమీ చెయ్యలేననిపిస్తుంది. నీకు దూరంగాపోవడమే న్యాయమనిపిస్తుంది. నిన్ను ఆజన్మాంతమూ ఆదుకునే మనశ్శక్తి నాకు లేదు.

అలా అలా ఆ వాక్యాలు అల్లుకుపోయి ఉన్నాయి. తనకు మొదట ఏమీఅర్థంకాలేదు. అయోమయంగా ఉంది. కళ్ళు చీకట్లు కమ్మాయి. మనస్సు మొద్దుబారింది. కొంత సేపటికి మనసులో ఒకభావం బండగా నిలిచింది. అతను తన్నువదలి దూరంగా పోతున్నాడు. తను అతనికి ఏమీ కాదు. అతనిత్రోవ వేరు. తనత్రోవ వేరు. మధ్య కల్పించుకున్నది మిథ్య.

చాలారోజులు తనుకోలుకోలేదు. కదలికలేని కాసారంలో ఒక్క కెరటం ఒక్కక్షణం గాలికి కదిలి కల్లోలపరచి సుడిగుండం వదలి వెళ్ళింది. క్షణం ఆప్యాయతచూపి అతను భరించలేని ఒంటరితనం శూన్యము మిగిల్చివెళ్ళాడు. బయటి ప్రకృతిలో ఏది మనసును తాకలేదు. మతి స్థిమితంకూడా

ఉందో లేదో తనకే తెలియదు. తను అతనికి జవాబు రాయలేదు. అతనూ మళ్ళా రాయలేదు.

చాలారోజులకు అతను చేసినపని మంచిదనితోచింది. క్షణం కలిగిన జాలిచేత ఆదుకుంటే ఆజన్మాంతమూ తాను అతనికి భారంకాక తప్పదు. అతను ఉత్సాహంతో ముందుకు సాగితే తను అతన్ని అనుసరించలేదు. అడుగడుగునా అది అతనికి మోయలేని బరువుకాక తప్పదు.

అతనిమీద కోపంరాలేదు. అతనిమీద ప్రేమపోలేదు. మనసులో మిగిలిన అగాధం మరుగుపడలేదు. పచ్చగా కలకలలాడుతున్న వనంలోకి పిలవకుండా తుఫాను వచ్చి కాస్సేపు కలవరపరచి ఆకులురాల్చి, శిథిలంచేసి తన తోవన తాను వెళ్ళింది. ఆ తుఫాను ఎందుకు వచ్చిందో ఎందుకు వెళ్ళిందో, మధ్యలో ఊగిసలాడి తోట ఎందుకు మోడుబారిందో ఎవరికి తెలుసు? ఎవరు చెపుతారు? అది ప్రకృతిధర్మం అంతకన్నా ఏముంది?

పార్కు మునుపటిలా లేదు. తుఫానుగాలికి ఆకులురాలిపోయాయి. చెట్లు కూలిపోయాయి ఎక్కడ చూచినా తోట చిందరవందరగా ఉంది. తన బ్రతుకులాగే మోడుబారిఉంది. మధ్యన ఎర్రపూలచెట్టుమాత్రం అలాగేఉంది, ఏ తుఫానుకు లొంగని శిలలా, చలించని ధైర్యంలా! ఆవేళ ఆ ఎర్రపూల చెట్టుదగ్గరే కూచుంది, శూన్యంగా దిక్కులుచూస్తూ! పొద్దు వాలుతోంది. స్మశానంలో ఉన్నతోట భయాన్ని కలిగిస్తోంది! తనలో మంచీ చెడూ ఆలోచించే శక్తి నశించింది.

కాకపోతే పదిమంది వచ్చేపార్కులో ఒంటరిగా కూర్చోవడ మేమిటి? అది తప్పని తోచలేదు. భయమూ వెయ్యలేదు. కాస్సేపటికి జానకమ్మ పలకరించింది.

"ఇక్కడున్నావా అమ్మా, మీకోసం ఇంటికి వెళ్ళి వస్తున్నాను" అంది. తాను బదులు పలకలేదు. తెల్లబోయి చూస్తూ ఊరుకుంది. జానకమ్మే మళ్ళీ మాట్లాడింది

"చాలా రోజులుగా మీరు శశికళను పలకరించటమే లేదట! దగ్గరగావస్తే దూరంగా పోతున్నారట? మాధవీ టీచరుకు నామీద కోపం వచ్చింది అని అదిరోజూ ఇంటి దగ్గర గోలపెట్టి ఏడుస్తోంది నాలుగు రోజులుగా జ్వరం కూడా వస్తోంది! నిద్రలో మగతగా మీ పేరే కలవరిస్తోంది. ఒకసారి ఇంటికివచ్చి చూస్తారేమో, తీసుకుపోదామని వచ్చాను" అంది.

తను ఉలిక్కిపడింది. నాలుగురోజులుగా శశికళ బడికి రావటంలేదనికూడా తను శ్రద్ధగా గమనించలేదు. ఏమైంది ఎందుకు రాలేదని ఎవరిని అడుగనూలేదు. ఏదో తప్పు చేసినట్లు మనస్సు బాధపడింది మతిపోగొట్టిన తన పరధ్యానానికి సిగ్గుపడింది. తను వెంటనే జానకమ్మతో వాళ్ళింటికి వెళ్ళింది. తన్ను చూడగానే శశికళ మంచంమీద లేచి కూర్చుంది. పరమానందంతో పకపకా నవ్వింది. తనూ నవ్వింది, సంతోషంగా! ఆ పసిపాప నవ్వుమనస్సులో హత్తుకుంది. మసకవదలి మనసు విప్పారింది. వాడినవనంలో మళ్ళా పువ్వుపూసింది. తోటలోలేని పున్నాగపూలు శశికళ ఇంట్లో జలజలా రాలాయి. నిజంగానే!